క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి విభాగాధిపతిగా డాక్టర్ నవీన్‌కుమార్


డాక్టర్ నవీన్‌కుమార్

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతిగా ఆస్పత్రి జీఎం (మెడికల్) డాక్టర్ ఎ.పి.నవీన్ కుమార్ నియమితులయ్యారు. ఉక్కు ఆస్పత్రి విభాగాధిపతిగా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ కె.హెచ్.ప్రకాష్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. దీంతో యాజమాన్యం డాక్టర్ నవీన్‌కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 1991లో ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా చేరిన నవీన్ కుమార్ అంచెలంచెలుగా జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారు. ఆయన 1998లో జనరల్ మెడిసిన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఉక్కు ఆస్పత్రిలో మంచి ఫిజీషియన్‌గా పేరున్న నవీన్‌కుమార్‌కు విభాగాధిపతి బాధ్యతలు అప్పగించడంపై ఉక్కు వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

హనుమజ్జయంతి ప్రత్యేక పూజలు నేడు

అక్కిరెడ్డిపాలెం: హనుమాన్ జయంతి సందర్భంగా గాజువాక పరిధిలో పలు ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. షీలానగర్, అక్కిరెడ్డిపాలెం వివేకానంద కాలనీలోని పర్వతాంజనేయ స్వామి ఆలయంలో, బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్నగిరి దాసాంజనేయ స్వామి గుడితో పాటు పలు దేవాలయాల్లో హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల ధర్మకర్తలు తెలిపారు.

డాక్టర్ బాబ్జీకి బాల సాహిత్య సేవారత్న అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ బాబ్జీ

మద్దిలపాలెం: మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, కవి, రచయిత, కళాకారుడు డాక్టర్ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీకి మరో అవార్డు దక్కింది. హైదరాబాద్ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సేవారత్నం అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, డాక్టర్ వరప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆయన ఈ అవార్డును స్వీకరించారు. తనకు పురస్కారం అందించిన సారస్వత పరిషత్ ప్రతినిధులకు డాక్టర్ బాబ్జీ కృతజ్ఞతలు తెలిపారు. విశాఖకు చెందిన వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు ఆయన్ని అభినందించారు.

జూనియర్ ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు


సీట్లు పొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న రూపవతి

గోపాలపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించినట్లు మేహాద్రి గెడ్డ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మృదుల ప్రియదర్శిని తెలిపారు. కౌన్సెలింగ్‌కు ఉమ్మడి జిల్లా గురుకుల సమన్వయకర్త ఎస్.రూపవతి చైర్మన్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. విశాఖ జిల్లా పరిధిలోని 7 మహిళా గురుకులాల్లో జూనియర్ ఇంటర్‌లో సీట్ల భర్తీకి అడ్మిషన్ కౌన్సెలింగ్ స్పాట్ అడ్మిషన్లు జరిగాయి. జిల్లాలోని మేహాద్రి గెడ్డ, సీవోఈ మధురవాడ, నక్కపల్లి, కోనాం, తాళ్లపాలెం, నర్సీపట్నం, కొక్కిరాపల్లి గురుకులాల్లో 73 సీట్లకు గాను సుమారు 200 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ ఖాళీలను మెరిట్ ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా భర్తీ చేశారు. గురుకుల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ జి.గ్రేస్, టి నాగమణి, కె.సువర్ణ రత్న కుమారి, సీహెచ్ హిమవతి కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

నయనం.. పదిలం


యువతికి కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ ఆశాశ్రీ


నేత్ర వైద్యశాల వద్ద వేచియున్న రోగులు

- వైఎస్సార్ నేత్ర వైద్యశాలకు విశేష ఆదరణ
- ఐదేళ్లలో 49వేల మందికి వైద్య సేవలు
- 42,681 మందికి కళ్లద్దాలు అందజేత
- అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు

అగనంపూడి: పారిశ్రామిక పెద్దాసుపత్రి అగనంపూడి ఏరియా హాస్పిటల్ ఆవరణలోని వైఎస్సార్ నేత్ర వైద్యశాలకు విశేష ఆదరణ లభిస్తోంది. ఇక్కడ నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా కళ్లద్దాలు అందిస్తుండడంతో ప్రతీ రోజు 50 నుంచి 60 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఇక్కడి సిబ్బంది రిఫర్ చేస్తున్నారు. అనంతరం వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసి, కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

అందుబాటులో అధునాతన పరికరాలు

ఈ ఆస్పత్రిలో కంటి పరీక్షలకు అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఆటో రిఫ్రాక్టోమీటర్, ఫండస్ కెమెరా, స్నెలెన్ చార్ట్, స్లిట్ ల్యాంప్‌లు వంటి పరికరాలతో ఇక్కడ నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆప్తమాలజిస్ట్ పి.ఆశాశ్రీ నేతృత్వంలో ముగ్గురు సిబ్బంది నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్నారు.


స్క్రీనింగ్ టెస్ట్ చేస్తున్న పీఎంవోఏ వెంకటరమణి


నెలకు 40–50 శస్త్రచికిత్సలు

నెలకు సరాసరి ఆరు వందల మందికి నేత్ర పరీక్షలు చేస్తున్నారు. వీరిలో శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి, ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఇక్కడి నేత్ర వైద్యురాలి పర్యవేక్షణలో శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. నెలకు సరాసరి 40 నుంచి 50 మందికి శస్త్ర చికిత్సలు చేసి, కళ్లద్దాలు అందిస్తున్నట్టు డాక్టర్ ఆశాశ్రీ తెలిపారు. పారామెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ (పీఎంవోఏ) ఎ.వెంకటరమణి, టెక్నీషియన్ ఆర్.రాజశేఖర్ ఇక్కడికి వచ్చేవారికి సేవలు అందిస్తున్నారు.

ఏడాదిలో 9,200 మందికి స్క్రీనింగ్ టెస్ట్

గత ఐదేళ్లలో సుమారు 49వేల మందికి ఇక్కడ సేవలు అందించారు. 42,681 మందికి కళ్లద్దాలు ఉచితంగా అందించారు.23వేల 6వందల మందికి ఫండస్ స్కానింగ్ చేసినట్టు వైద్యురాలు తెలిపారు. గతేడాది 9వేల 2వందల మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించగా, 8వేల 950 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని తెలియజేశారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవా రం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు.

చురుగ్గా భవిత ప్రత్యేక సర్వే

పెదగంట్యాడ: దివ్యాంగులను బడిబాట పట్టించి సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నామని ఎంఈవో కె.రమణాజీ తెలిపారు. ఎంఈవో ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రాంతాల్లో దివ్యాంగులను గుర్తించేందుకు శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇప్పటి వరకూ పాఠశాలలో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలను సేకరించారు. చదువుల వల్ల ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఎంఈవో మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను చేపడుతున్నాయని తెలిపారు. మండలంలో వైకల్యం ఉన్నవారిని గుర్తించి, అందరినీ బడుల్లో చేర్పడమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్రం నిర్వాహకులు ఎం. సూర్యనారాయణ, జయభారతి తదితరులు పాల్గొన్నారు.


సర్వేలో పాల్గొన్న ఎంఈవో రమణాజీ

స్టీల్‌ప్లాంట్ స్థలంలో ఆక్రమణల తొలగింపు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్డును అధికారులు తొలగించారు. స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీఎస్ సునీత తెలిపిన వివరాలివి.. పెదగంట్యాడ మండలం నడుపూరు పరిధిలోని ఎస్సీ కాలనీలో పార్కు నిమిత్తం గతంలో అధికారులు స్థలాన్ని విడిచిపెట్టారు. ఆ స్థలంపై కన్నేసిన ఓ వ్యక్తి అందులో షెడ్డు నిర్మాణం చేపట్టాడు. దీనిపై స్థానికులు ఫిర్యాదులు చేయడంతో స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత స్పందించారు. ఆక్రమణలు తొలగించి, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్‌డీసీ, పెదగంట్యాడ మండల డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ ఆదేశాల మేరకు స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులు, పెదగంట్యాడ మండల రెవెన్యూ సిబ్బంది , సచివాలయ సిబ్బందితో కలసి శుక్రవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ నిర్మించిన షెడ్డును జేసీబీ సాయంతో తొలగించారు. ఎస్‌డీసీ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్రమణదారులపై కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడబోమన్నారు.


స్టీల్‌ప్లాంట్ స్థలంలో నిర్మించిన షెడ్డును తొలగిస్తున్న దృశ్యం

ఆలయ అభివృద్ధికి రూ.7.5 లక్షల విరాళం

అక్కిరెడ్డిపాలెం: బెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ సముదాయ అభివృద్ధికి ఓ దాత భారీ విరాళం అందజేశారు. 69వ వార్డు నాతయ్యపాలెం వాస్తవ్యుడు, వ్యాపారవేత్త గోపిశెట్టి ఆదినారాయణ రూ.7 లక్షల 50 వేలను చెక్కు రూపంలో ఆలయ కమిటీ చైర్మన్ గండ్రెడ్డి రామునాయుడుకు బాల వినాయకుని ఆలయంలో శుక్రవారం అందజేశారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొడ్డెడ అచ్చిలినాయుడు, మిండా లక్ష్మి, శాంతి కుమారి, సత్యవతి, శ్రీనివాసరావు, పెట్ల అప్పారావు, ఆలయ అర్చకులు కొత్తలంక లక్ష్మీనారాయణ మూర్తి, సిబ్బంది సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ కమిటీ చైర్మన్ రామునాయుడుకు చెక్కు అందిస్తున్న గోపిశెట్టి ఆదినారాయణ

పర్యావరణహితంగా జీవిద్దాం

ఏయూక్యాంపస్: ప్రతి వ్యక్తి పర్యావరణహితంగా జీవించడం అలవరచుకోవాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎంవీపీ కాలనీలోని సమతా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ తమ కర్తవ్యంగా భావించినపుడే పూర్తిస్థాయిలో ఫలితాలు వస్తాయన్నారు. ఈ ఏడాది మన భూమి నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వ్యక్తి 10 మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం బాధ్యతగా స్వీకరించాలని కోరారు. విశాఖను ఒక సామాజిక వనంగా మార్చు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రకృతి ఆధారిత పంటలు పెంచాలి

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.ఎస్.ఆర్.సి.మూర్తి మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు పండించే వారికి ప్రోత్సాహం అందించడం అవసరమన్నారు. ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు స్ఫూర్తిని ఇవ్వడం తెలియజేయడం, అమలు చేయడం ద్వారా పర్యావరణ సంరక్షణలో భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. సమత కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలు రాజీ ప్రవీణ, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, కళాశాల అధ్యాపకులు శ్రీదేవి, యాక్షన్ ఎయిడ్ ప్రతినిధి కృష్ణకుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ముకుందరావు తదితరులు

పొగాకుతో జీవితాలు నాశనం



ర్యాలీ నిర్వహిస్తున్న విజ్ఞాన్ ఫార్మా కళాశాల విద్యార్థులు

- యువత వాటికి దూరంగా ఉండాలి
- ఫార్మా విద్యార్థుల అవగాహన ర్యాలీ

అగనంపూడి: పొగాకు ఉత్పత్తులు, గుట్కా, ఖైనీ వంటి క్యాన్సర్ కారకాలకు యువత దూరంగా ఉండాలని విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోని ఫార్మా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు, ఖైనీ, గుట్కాలను కొంతమంది యువత ఫ్యాషన్‌గా భావిస్తున్నారన్నారు. నేటి యువత ఆహారపు అలవాట్ల వల్ల, ఇటువంటి క్యాన్సర్ కారకాలు తీసుకోవడం వల్ల త్వరగా క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. గ్రామాల్లో, పెద్దలకు అవగాహన కల్పించాల్సిన యువతే వీటికి బానిసలు కావడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఇప్పటికైనా యువతలో మార్పు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాపు జగ్గరాజుపేట, యాదవ జగ్గరాజుపేటల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

‘ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడం అన్యాయం’

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల జీతాలు చెల్లించకుండా వారి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయాలని చూడడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు కె.గంగారాం అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1205వ రోజు కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ఉత్పత్తులు మెరుగుపడినా నేటికీ జీతాలు చెల్లించకుండా జాప్యం చేయడం కార్మికులను, వారి కుటుంబ సభ్యులను వేధించడమే అవుతుందన్నారు. కార్మికులు, ఉద్యోగులు ప్రతీ నెలా ఈఎంఐలు చెల్లించాల్సి ఉందని, ఈ విషయంలో కార్మికుల్ని డిఫాల్టర్లుగా చేసి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్న యాజమాన్యం తీరు మార్చుకోవాలని కోరారు. గోవింద్, బొంజుబాబు, సుమన్, వైకుంఠరావు, కృష్ణమోహన్, ఆలీషా, ఈశ్వర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఉక్కు ఈఎస్అండ్ఎఫ్, సేఫ్టీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు

మాటూరి సేవలు ప్రశంసనీయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు సివిల్ ఇంజినీరింగ్ విభాగం (సీఈడీ) సీనియర్ మేనేజర్ మాటూరి తిరుపతిరావు అందించిన సేవలు ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎ.కె.సోబ్తీ అన్నారు. మాటూరి తిరుపతిరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఉక్కు డెడికేషన్ పార్కులో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. మాటూరి సీఈడీలోని వివిధ సెక్షన్లలో 35 ఏళ్లు పని చేసి, అందరి మన్ననలు పొందారన్నారు. క్రమశిక్షణ, నిస్వార్థ సేవలకు గుర్తింపుగా జవహర్‌లాల్ నెహ్రూ అవార్డు పొందారన్నారు. విభాగాధిపతి పి. రవికుమార్ మాట్లాడుతూ విభాగం అభివృద్ధికి మాటూరి చేసిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, కె.వి.డి. ప్రసాద్, మాటూరి శ్రీనివాసరావు, కారు రమణ, విభాగం డీజీఎం పరమట సత్యనారాయణ, వెల్ఫేర్ కమిటీ సభ్యులు జి.రవితేజ, శివరామకృష్ణ, సందీప్, కనకరెడ్డి, డి భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాటూరిని సత్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోబ్తీ, వివిధ సంఘాల నాయకులు

నేడు, రేపు టాలెంట్ హంట్ పోటీలు

దాబాగార్డెన్స్ : మిరాకిల్ ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో 1, 2 తేదీల్లో టాలెంట్ హంట్ పేరిట ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ తెలిపారు. కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం, వెస్టర్న్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ పోటీలు ఉంటాయన్నారు. అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చని చెప్పారు. పౌరగ్రంథాలయం వేదికగా సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు, ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయని, పాల్గొనదలిచే వారు 9966485335, 9553333134 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నిప్పుల కుంపటి


ఖాళీగా కనిపిస్తున్న సిద్ధేశ్వరం ప్రధాన రహదారి


జనసంచారం తక్కువగా ఉన్న పెదగంట్యాడ కూడలి

- దంచికొడుతున్న రోహిణికార్తె ఎండలు
- ఉష్ణతాపంతో అల్లాడుతున్న జనం
- సాయంత్రమైతే గానీ బయటకు రాలేని పరిస్థితి

పెదగంట్యాడ: ప్రచండ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.. నడి నెత్తిన నిప్పులు కురిపిస్తున్నాడు.. వడగాడ్పులతో జనం అల్లాడిపోతున్నారు. రోడ్లపైకి రావాలంటేనే భయపడిపోతున్నారు. ఎండల తీవ్రత కారణంగా మండలంలోని అన్ని ప్రాంతాలు కర్ఫ్యూను తలపించాయి. ప్రధాన కూడళ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండ వేడి విపరీతంగా పెరిగిపోవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు , రోడ్లు జనాలు లేక పోవడంతో బోసిపోయాయి. మధ్యాహ్నం 12 గంటలకే దుకాణాలను మూసి వేస్తున్నారు. రోహిణీ కార్తె ప్రభావంతో వేడి పెరిగిపోవడంతో ప్రజలు ఉపశమనం కోసం తహతహలాడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఉష్ణతాపం పెరిగిపోవడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పిల్లలు, వృద్ధులు వేడిని తాళలేకపోతున్నారు.


నిత్యం రద్దీగా ఉండే ఆటోనగర్ ఏరియా ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం

ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి



ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలు బయటకు రాకపోవడం మంచిది. విపరీతమైన తలనొప్పి, తీవ్ర జ్వరం, మగత నిద్ర, పాక్షికంగా అపస్మారక స్థితి ఉంటే వడదెబ్బ లక్షణాలుగా గుర్తించి, వెంటనే చికిత్స చేయించుకోవాలి. వడ దెబ్బ తగిలిన వారిని చల్లని ప్రదేశంలో ఉంచి, తడిగుడ్డతో శరీరాన్ని తుడిచి, చల్లని గాలి తగిలేలా చూడాలి. వెంటనే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి.

– డాక్టర్ రమేష్‌బాబు,
పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి

తులసి స్ఫూర్తితో పోరాడాలి


తులసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

మద్రిపాలెం: అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు వై.తులసి ఎంతగానో శ్రమించారని, ప్రతి ఒక్కరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. ఇటీవల హఠాన్మరణం చెందిన తులసి సంతాప సభ శుక్రవారం మద్రిపాలెం ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ తులసి మృతి ఇటు యూనియన్‌ను.. అటు ఆమె కుటుంబాన్ని కలచి వేసిందని, అందరికీ తీరని లోటన్నారు. అంగన్‌వాడీ సమస్యలు పోరాటాల ద్వారానే పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో అర్బన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు నూకరత్నం, వెంకటలక్ష్మి, సూపర్ వైజర్ జ్యోతి, యూనియన్ లీడర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.